క్లుప్తంగా

భైరవస్వామికి విశేష పూజలు



భైరవస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని భైరవవాకలో ఉన్న భైరవస్వామికి ఆదివారం విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం, అమావాస్య కలిసి రావడంతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అమృత కలశాలు సమర్పించారు. విభూదితో అభిషేకం నిర్వహించారు. భక్తులతో ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల అటవీ మార్గం రద్దీగా మారింది.

నేడు వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల సమావేశం



కోన రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు

పరవాడ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 8.30 గంటలకు పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సదరు సమావేశానికి మండల వైస్ ఎంపీపీలు, ముఖ్య నాయకులు, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆ ప్రకటనలో కోరారు.

75 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంఘం ప్రతినిధులు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం పెందుర్తి శాఖ ఆధ్వర్యంలో చినముషిడివాడలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు పాల్గొని 75 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందించారు. వైద్యులు సునీత, వెంకటరావు, సతీష్, పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి వై.కామరాజు, జగన్నాథదాసు, ఈశ్వరరావు, అప్పారావు, పాపారావు, సూర్యారావు, సీతారామరాజు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిన రాయిపుర అగ్రహారం రోడ్డు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డు నుంచి వంగలిలోని పెట్రో, మారిటైం విశ్వవిద్యాలయాలకు వెళ్లే రాయపుర అగ్రహారం రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం పెట్రో యూనివర్సిటీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీటితో పాటు మారిటైం విశ్వవిద్యాలయంలో సైతం నిర్మాణ పనులు జరుగుతుండటంతో నిత్యం ఈ రోడ్డుపై భారీ వాహనాలతో నిర్మాణ సామగ్రి తరలిస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది లారీలు మెటీరియల్‌తో రాకపోకలు సాగిస్తూ, రోడ్డు రద్దీగా ఉంది. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డు భారీ వాహనాల కారణంగా అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఈ గోతుల్లో పడి పలుమార్లు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.

ఘనంగా శాకాహార సద్భావన ర్యాలీ

పెదగంట్యాడ: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివగణేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 74వ వార్డు పరిధిలో శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శ్రీ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సి.జగదీశ్వరి, బాలాజీ, భాగ్య గౌరీ, అప్పలరాజు, సుబుధి, కనకారావు, నాయుడు, విష్ణుకుమార్, నందిని, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చందన సేవలో..



చందనాన్ని అరగదీస్తున్న నాల్గవ తరగతి సిబ్బంది

తన బాల్యమిత్రుడైన కుచేలుడు పిడికెడు అటుకులిస్తేనే మురిసిపోయి అంతులేని సిరిసంపదలిచ్చాడట శ్రీకృష్ణుడు. సింహాద్రి అప్పన్న కొలువులో నాల్గవ తరగతి సిబ్బంది విషయంలో సీన్ కాస్త రివర్స్. అయినప్పటికీ.. ఆనందం మాత్రం దాదాపు అంతే స్థాయి. కిలో చందనం అరగదీస్తే దేవస్థానం మూడు కిలోల బియ్యాన్నిస్తుంది వీరికి. దాన్నే మహా ప్రసాదంగా భావిస్తారు ఈ దిగువ స్థాయి ఉద్యోగులు. అప్పన్న నిజరూపాన్ని 364 రోజులపాటు కప్పిఉంచి, స్వామికి చల్లదనాన్నందించే చందనాన్ని అరగదీసేది వీరే. తమ చేతుల మీదుగా దాన్ని సిద్ధంచేసే భాగ్యం దక్కడం.. పూర్వజన్మ సుకృతం గాక మరింకేంటని.. చెప్పలేనంత సంతోషంతో ఎదురు ప్రశ్నిస్తారు వీరు..!



అరగదీసిన పచ్చి చందనం ముద్ద



చందనం అరగదీతలో తరిస్తున్న నాల్గవ తరగతి సిబ్బంది

ఏటా నాలుగు పర్యాయాలు చందనం అరగదీత

పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్న సిబ్బంది

సింహాచలం: ఏడాదంతా 12 మణుగుల(సుమారు 500 కిలోలు) చందనంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చల్లగా సేదదీరి, తన భక్తులకు చల్లని దీవెనలందిస్తాడు. అక్షయ తృతీయ సమీపిస్తోంది. చందనస్వామి నిజరూపంలో దర్శనమిస్తాడు. అదికూడా కొన్ని గంటలు మాత్రమే. ఆ తర్వాత మళ్లీ చందనరూపుడుగా మారతాడు. ఆ చందనాన్ని తమ చేతుల మీదుగా అరగదీయడాన్ని సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వర్తించే నాల్గవ తరగతి ఉద్యోగులు మహద్భాగ్యంగా భావిస్తారు. ఎవరికీ దక్కని ఈ అవకాశం తమకు మాత్రమే లభించడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. తొలి విడత చందన సమర్పణకు చందన స్వామికి నమస్కరిస్తూ భక్తిశ్రద్ధలతో చందనాన్ని అరగదీసే కార్యక్రమం చేపడతారు.



ఒక్కో ఉద్యోగి తీసిన చందనాన్ని తూకం వేస్తున్న వైదికులు(ఫైల్)

నాలుగు విడతలుగా చందన సమర్పణ

సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందన స్వరూపుడు. ఏటా నాలుగు విడతల్లో స్వామికి పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. వైశాఖ శుద్ధ తదియ(అక్షయ తృతీయ)ను పురస్కరించుకుని జరిగే చందనోత్సవంరోజు స్వామివారి నిజరూప దర్శనం ఉంటుంది. నిజరూప దర్శనం పూర్తికాగానే అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగు(సుమారు 125 కిలో)ల పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. ఆ తర్వాత వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి పర్వదినాల్లో మరో మూడేసి మణుగులు చొప్పున పచ్చి చందనాన్ని పూస్తారు. ఆయా సమర్పణల పర్వదినాలకు ముందు మూడు నుంచి ఐదు రోజుల పాటు ఆలయ బేడా మండపంలో అరగదీత కార్యక్రమం శాస్త్రోక్తంగా జరుగుతుంది. ఇందుకు ఉపయోగించే గంధపు చెక్కలను తమిళనాడు నుంచి తెప్పిస్తారు. జాజిపోకల అనే మేలు రకం గంధాన్ని స్వామివారి కోసం వినియోగిస్తారు.

నాల్గవ తరగతి ఉద్యోగులే కీలకం

ఆలయంలో విధులు నిర్వర్తించే నాల్గవ తరగతి ఉద్యోగులే చందనం అరగదీతను చేపడతారు. దేవస్థానం అందించే నూతన పంచెలను ధరించి, నోటికి వస్త్రాన్ని కట్టుకుని, ఎంతో భక్తి శ్రద్ధలు, నియమనిష్ఠలతో చందనాన్ని అరగదీస్తారు. ఒక్కో విడతలో కావాల్సిన సుమారు 125 కిలోల చందనాన్ని వీరే సిద్ధం చేస్తారు. ఇలా అరగదీసిన చందనంలో సుగంధ ద్రవ్యాలను కలిపి ఆయా పర్వదినాల్లో వైదికులు స్వామికి సమర్పిస్తారు. స్వామిపై ఉన్న చందనం తమ చేతుల మీదుగా అరగదీయడాన్ని ఈ ఉద్యోగులు ఎంతో అదృష్టంగా భావిస్తారు. తమకు మాత్రమే దక్కిన ఈ మహా భాగ్యానికి ఆనందంతో పరవశిస్తారు.

కిలో చందనం.. మూడు కిలోల బియ్యం

ఒక కేజీ చందనం అరగదీస్తే మూడు కిలోల బియ్యాన్ని దేవస్థానం ఈ నాల్గవ తరగతి సిబ్బందికి అందిస్తుంది. అరగదీసిన చందనాన్ని కిలోల లెక్కన వైదికులు తూకం వేసి, వారి ఖాతాలో రాస్తారు. ఇలా ఒక్కో ఉద్యోగి వ్యక్తిగతంగా ఎన్ని కిలోల చందనం అరగదీస్తే అన్ని మూడేసి కిలోల చొప్పున బియ్యాన్ని దేవస్థానం నుంచి తీసుకుంటారు. ఈ బియ్యాన్ని స్వామివారి మహా ప్రసాదంగా వీరంతా స్వీకరిస్తారు. తరతరాలుగా ఎంతో మంది నాల్గవ తరగతి ఉద్యోగులు చందనం అరగదీతలో పాల్గొని తరిస్తున్నారు. చందనం అరగదీసే రోజుల్లో ఆలయమంతా చందన పరిమళాలను వెదజల్లడం ఒక మంచి అనుభూతిని అందిస్తుందని, అనందంగా చెప్తారు.

28 ఏళ్ల నుంచి చందనం అరగదీత



నేను 28 ఏళ్ల నుంచి చందనం అరగదీతలో పాల్గొంటున్నాను. చందనం అరగదీత చేపట్టే రోజుల్లో ఆలయం అంతా ఒక కొత్త వాతావరణాన్ని సంతరించుకుంటుంది. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా చందనాన్ని అరగదీస్తాం. స్వామిపై ఉండే చందనం మా చేతుల మీదుగా అరగదీయడం నిజంగా ఆ స్వామి మాకు కల్పించిన మహా భాగ్యమే.

– శిడగం అప్పలరాజు, నాల్గవ తరగతి ఉద్యోగి

ఇదంతా అప్పన్న స్వామి అనుగ్రహం



ఉద్యోగంలో చేరినప్పటి నుంచి స్వామివారి చందనం అరగదీతలో పాల్గొంటున్నా. ఇప్పటికి సుమారు 30 ఏళ్లకు పైగానే చందనం అరగదీశానను కుంటా. ఏటా నాలుగు విడతల్లో జరిగే అరగదీతలో క్రమంతప్పకుండా పాల్గొంటున్నా. స్వామిపట్ల భక్తితోపాటు, గంటల తరబడి చందనం అరగదీయడం మాకు మంచి వ్యాయామంగా కూడా ఉంటుంది.

– భీమవరపు అప్పారావు, నాల్గవ తరగతి ఉద్యోగి

గంధం అమావాస్య భక్తులకు అన్నసమారాధనలు



టీటీడీ సత్రం ఎదురుగా అన్నసమారాధనలో భక్తులకు వడ్డన చేస్తున్న బంటుబిల్లి మహేష్



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న అక్షయ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు

సింహాచలం: గంధం అమావాస్యను పురస్కరించుకుని సింహాచలం వచ్చిన భక్తులకు కొండదిగువ వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలో పలువురు పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక టీటీడీ సత్రం ఎదురుగా అడవివరం కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్నసమారాధన జరిపారు. స్థానికులు గుసిడి రమణ, గండ్రెడ్డి నాగరాజు, సత్యారావు, గురునాథ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- వరాహ పుష్కరిణికి సమీపంలో ఉన్న నృసింహ సదన్ వద్ద అక్షయ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కె.కృష్ణ ఆధ్వర్యంలో ఉదయం రెండువేల మందికి అల్పాహారం, మధ్యాహ్నం రెండువేల మందికి పులిహోర, పొంగలి, దధ్యోజనం, చక్కెర పొంగలి అందించారు.
- సింహాద్రిమఠం గురుస్వామి కె.సురేంద్ర, నారాయణసేవా దళం అధ్యక్షుడు నారాయణ తదితరులు కూడా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

చెట్లు నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సూరపురాజు చెరువులో నరికేసిన చెట్లను రైతులతో కలిసి పరిశీలిస్తున్న గండి రవికుమార్

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో పడి దోచుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆరోపించారు. మండలంలోని గొటివాడ గ్రామ రెవెన్యూ పరిధి సూరపురాజు చెరువులో అక్రమంగా నరికివేసిన చెట్లను గ్రామస్తులు, ఆయకట్టు రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాల ద్వారా కొండల్ని, గుట్టల్ని ఖాళీ చేశారని ఆరోపించారు. ఇప్పుడు చెరువు గర్భంలోని సుమారు 50 ఏళ్ల నాటి రూ.20 లక్షల వరకూ విలువ చేసే నేరేడు, మద్ది, యూకలిప్టస్ చెట్లను అక్రమంగా నరికి, తరలించుకుపోయారని పేర్కొన్నారు. సాగునీటి కమిటీకి, పంచాయతీ పాలకవర్గానికి, ఆయకట్టు రైతులకు ఎలాంటి సమాచారం లేదన్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆక్షేపించారు. తహసీల్దార్ స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెట్లు నరికినవారిపై చర్యలు తీసుకోకపోతే అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఉప సర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, మండల వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ విరోతి అప్పనాయుడు, లగిశెట్టి కుమార్, లగిశెట్టి అప్పలనాయుడు, విరోతి అప్పారావు, సాలాపు సత్యారావు, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, ఐడి బాబు, యడ్ల నాయుడు తదితరులు ఉన్నారు.

పహల్గాం ఘటనపై నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న సిటు కార్యకర్తలు



గొల్లలపాలెం శివలోహిత డ్రీమ్ వ్యాలీలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

పరవాడ: జమ్ము కశ్మీర్ పహల్గాం ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాల్ కూడలిలో పహల్గాం దుర్ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో ఆదివారం ర్యాలీ చేపట్టారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను ఖండించారు. అమాయక పర్యాటకులను అత్యంత కిరాతకంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను మట్టుపెట్టి, ఇటువంటి దుశ్చర్యలకు మరోసారి పాల్పడకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన 28 మంది పర్యాటకులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రాళ్లపల్లి సన్యాసినాయుడు, కన్నూరు నాయుడు, బి.శ్రీను, లచ్చిబాబు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం సమీపానున్న శివలోహిత డ్రీమ్ వ్యాలీ ప్రజలు కాశ్మీర్‌లోని పెహల్గాంలో హిందువులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రమూకలను తుదముట్టించేందుకు ప్రధాని మోదీకి భారతీయులంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. 28 మందిని పాశవికంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను పట్టుకుని ఉరి తియ్యాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, తిరుమలరావు, బగాది రవి, పలువురు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శరగడం, తదితరులు

- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు, వేలాదిమంది భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వెలుగులు





ఆలయ అభివృద్ధి కోసం రూ.లక్ష చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, రామునాయుడు



మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు



ఆకట్టుకున్న శక్తి వేషధారి

పెందుర్తి: పెందుర్తి ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి వార్షిక పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు అగ్ని గుండాలు తొక్కారు. పసుపు–కుంకుమలు, చీరలు, ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీ ఎత్తున మజ్జిగ వితరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాణాసంచా వెలుగులు అబ్బురపరిచాయి. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తీరంలో సండే సందడి



మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. ఎండలు మండుతున్న నేపథ్యంలో సముద్రంలో స్నానాలు చేసేందుకు ఉత్సాహం చూపారు. అనకాపల్లి, తోటాడ, సబ్బవరం, లంకెలపాలెం, పరవాడ, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తీర ప్రాంతాల అందాలను తనివితీరా ఆస్వాదించి, ఇసుక తిన్నెలపై ఆటపాటలతో సరదాగా గడిపారు. సాయంత్రం వరకు సముద్రపు అలల మధ్య జలకాలాడుతూ కేరింతలు కొట్టారు. - పరవాడ

అపూర్వ సమ్మేళనం



నంగినారపాడు జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–03 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. పాఠశాల ఆవరణలో కలుసుకుని, నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి సంవత్సరం ఓ రోజున పూర్వ విద్యార్థులంతా కలుసుకోవాలని తీర్మానించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు గొల్లవిల్లి శంకర్, వియ్యపు తాతారావు, పల్లా చిన్నారావు, సిద్దా నగేష్, సేనాపతి సంతోష్, శెట్టి వరలక్ష్మి, సూర్యకళ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.